క్లుప్తంగా

ఎంపీడీఓగా జీవీ సరోవర్



అంబాజీపేట: కొత్త మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా జీవీ సరోవర్ గురువారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. అల్లవరం ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ అంబాజీపేటకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఇప్పటివరకు కె.వరలక్ష్మి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సరోవర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అంతకుముందు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావును ఎంపీడీఓ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన సరోవర్‌కు ఈఓపీఆర్డీ బి.మమత, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఇతర అధికారులు స్వాగతం పలికారు.

ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించిన జేడీ



పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలిస్తున్న జేడీ శ్రీనివాస్

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌ను గురువారం ఫిషరీస్ జేడీ శ్రీనివాస్ సందర్శించారు. ఈ నెల 15వ తేదీ నుంచి సముద్రంపై వేట ప్రారంభం కానున్న నేపథ్యంలో హార్బర్‌లో మత్స్యకారుల సౌకర్యాలను పరిశీలించారు. హార్బర్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏడీ హర్షవర్ధన్ ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పెదపట్నంలంక గ్రామానికి శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నగరం సబ్ స్టేషన్ ఏఈ సీహెచ్ రాజేంద్ర గురువారం తెలిపారు. విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం శుక్రవారం రావులపాడు, ఊబలంక, రావులపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ ఎం. రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రావులపాడు, ఊబలంక గ్రామాలతో పాటు, రావులపాలెంలోని డిగ్రీ కాలేజీ ఏరియా, అంకాలమ్మ గుడి ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

అయినవిల్లి: ఎస్.మూలపాలెం 33/11 కేవీ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఎం.రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేస్తారన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి

అంబాజీపేట: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎంపీడీఓ జీవీ సరోవర్ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులతో ఆయన గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలించి, సమస్యను పరిష్కరించాలన్నారు. తమ స్థాయిలో పరిష్కారం కాని అంశాన్ని తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కార్యాలయ నిర్వహణాధికారి కె.వరలక్ష్మి, ఈఓపీఆర్డీ బి.మమత, డిప్యూటీ తహసీల్దార్ పి.నాగపద్మలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు జీజీవీకే కుమార్, ఎం.వెంకటరమణ, వి.లక్ష్మీపతి, ఆర్వై చంటి, వీఆర్వోలు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు: ప్రాణాంతకమైన మలేరియా వ్యాధిపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట డివిజన్ వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ప్రధాన వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలా దేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ నేతృత్వంలో వైద్యారోగ్య సిబ్బంది గురువారం ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు, అందులో భాగంగా మలేరియా వ్యాధి నియంత్రణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. జ్వర పీడితులు సత్వరమే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రక్త పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అడిగిన పలు సందేహాలను వైద్యారోగ్య శాఖ అధికారులు నివృత్తి చేశారు.

భవితకు బంగారు బాట



కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల



స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

- కార్పొరేట్‌కు దీటుగా కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- ఎనిమిది కోర్సులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు
- డిజిటల్ క్లాస్ రూమ్స్, లేబొరేటరీలు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్
- స్కిల్ హబ్ సెంటర్ కూడా..

కొత్తపేట: విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ, ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉత్తమ ఫలితాలు, ఉన్నత ప్రమాణాలతో ముందుకు వెళుతోంది. నియోజకవర్గ, డివిజన్ కేంద్రమైన కొత్తపేటలో 1979లో ఈ కళాశాలను స్థాపించారు. గత 46 ఏళ్లుగా కొత్తపేట, పరిసర ప్రాంతాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా కళాశాలలో కోర్సులు, సౌకర్యాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు తదితర విషయాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు వివరించారు. ప్రస్తుతం ఈ కళాశాలలో 8 సబ్జెక్టుల్లో సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్ 2024–25 విద్యా సంవత్సరంలో అందుబాటులో ఉన్నాయి. మున్ముందు మరిన్ని కోర్సులు ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

> **విద్యార్థుల ఉన్నత భవిష్యత్తే లక్ష్యంగా..**
>
> 
>
> కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలతో ఉన్నత భవిష్యత్తు సాధించాలనే లక్ష్యంతో కళాశాలను ముందుకు తీసుకువెళుతున్నాం. ప్రభుత్వం, యూనివర్సిటీ నుంచి అన్ని అవకాశాలను విద్యార్థుల విద్యాబోధనకు సద్వినియోగ పర్చుకుంటున్నాం. మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. కళాశాల గొప్పతనాన్ని కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. ఈ విద్యా సంవత్సరం అధిక సంఖ్యలో విద్యార్థులు చేరి, అన్ని సౌకర్యాలతో కూడిన విద్యాబోధన, ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి.
>
> – డాక్టర్ కె.పెద్దిరాజు, ప్రిన్సిపాల్, వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్తపేట

కెరీర్ గైడెన్స్ సెల్, పీజీ ఎంట్రన్స్ కోచింగ్

పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకుని ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం కాంపిటేటివ్ కోచింగ్ క్లాసులు నిర్వహిస్తున్నారు. కాంపిటేటివ్ ఇంగ్లిష్, అర్థమెటిక్, న్యూమరికల్ ఎబిలిటీ, మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, జనరల్ సైన్సు, కరెంట్ ఎఫైర్స్ తదితర అంశాలపై విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. డిగ్రీ అనంతరం యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేయబోయే విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో పీజీ ఎంట్రన్స్ కోచింగ్‌ను ఇస్తున్నారు. ఎంకాం, ఎంఏ, ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, ఎంఏ ఇంగ్లిష్, ఎంసీఏ, ఎంఎస్సీ బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ తదితర వాటిలో ఈ క్లాసులను తృతీయ సంవత్సరం చివరలో నిర్వహిస్తున్నారు. ప్రతి సెమిస్టర్ విద్యార్థులకు రెండు సార్లు మిడ్–1, మిడ్–2 పరీక్షలు నిర్వహిస్తున్నారు. అదనంగా ప్రతి సెమిస్టర్ చివరలో ప్రీ–ఫైనల్ పరీక్షలను కూడా నిర్వహిస్తున్నారు. ఈ ఖర్చును పూర్తిగా అధ్యాపకులే భరిస్తారు.

లెర్నింగ్ వీడియోలతో..

అనుభవజ్ఞులైన అధ్యాపకులు తయారుచేసిన వీడియోలను లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంలో భాగంగా ప్రతి వారం విద్యార్థులకు వారి సెల్‌ఫోన్లలో వీడియో లెసన్స్ చూపిస్తారు. వీటిని యూట్యూబ్‌లో కూడా అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులకు నెల రోజుల వ్యవధితో సర్టిఫికెట్ కోర్సులనూ ప్రతి సెమిస్టర్‌లో నిర్వహిస్తారు. స్పోకెన్ ఇంగ్లిష్, డేటా ఎంట్రీ, జీఎస్టీ, టూరిజం, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ వంటి అంశాలపై ఆయా కోర్సులను నిర్వహిస్తున్నారు. యోగా, మెడిటేషన్ క్లాసులు కూడా నిర్వహిస్తారు.

అందుబాటులో జేకేసీ, డిజిటల్ క్లాసులు

కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా వివిధ ఆన్‌లైన్ కోర్సులను ఉచితంగా నిర్వహిస్తున్నారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నిర్వహించే ఉచిత కోర్సుల్లో విద్యార్థులను రిజిస్టర్ చేసి, వారితో ఈ కోర్సులను పూర్తిచేయించి, ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్లు అందిస్తున్నారు. జేకేసీ ల్యాబ్‌లోని కంప్యూటర్ల ద్వారా విద్యార్థులందరూ వారికి అవసరమైన కంప్యూటర్ వర్క్స్ చేసుకోవడానికి వీలు కల్పిస్తున్నారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా టీచింగ్‌లో కూడా మార్పులు చేసి, విద్యార్థులకు సాధారణ క్లాసులతో పాటు, 60:40 నిష్పత్తిలో డిజిటల్ క్లాసులను కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలో మూడు డిజిటల్ క్లాస్ రూములు అందుబాటులో ఉన్నాయి.

ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ సెంటర్

కళాశాలలో ప్రత్యేకంగా స్కిల్ హబ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. నిరుద్యోగ యువతకు ఇందులో మూడు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున శిక్షణ ఇచ్చి, వారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తున్నారు. ఇప్పటి వరకూ ఐదు బ్యాచ్‌లు పూర్తికాగా 150 మంది శిక్షణ పొందారు. త్వరలో రెండు బ్యాచ్‌లకు శిక్షణ ప్రారంభిస్తారు. ఇటీవల సుమారు రు.15 లక్షల వ్యయంతో అధునాతన కంప్యూటర్లను కొనుగోలు చేశారు. కంప్యూటర్ ల్యాబ్‌ను నాధునీకరించనున్నారు. సుమారు 16 వేల పుస్తకాలతో విశాలమైన లైబ్రరీ, రీడింగ్ రూమ్ విద్యార్థులు, అధ్యాపకులకు అందుబాటులో ఉంది. సురక్షిత మంచినీటి కోసం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పండగలు, ప్రత్యేక దినాల్లో ఏటా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు.

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

నూతన విద్యా విధానం 2020కి అనుగుణంగా ప్రతి విద్యార్థీ సంవత్సరం చివరలో ఇంటర్న్‌షిప్ చేసి శిక్షణ పొందాల్సి ఉంటుంది. మొదటి సంవత్సరం చివరలో ఒక నెల రోజుల పాటు కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టు పేరుతో గ్రామాల్లో ఉన్న ఆర్థిక, సామజిక స్థితిగతుల సమాచారాన్ని సేకరించి, నివేదికను కళాశాలకు సమర్పించాల్సి ఉంటుంది. ద్వితీయ సంవత్సరం చివరలో రెండు నెలల పాటు ఏదైనా ఒక కంపెనీలో శిక్షణ పొందాల్సి ఉంటుంది. తృతీయ సంవత్సరం చివరలో ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆరు నెలల పాటు ప్రాక్టికల్ ట్రైనింగ్‌ను ఏదైనా కంపెనీ లేదా సంస్థలో పూర్తి చేసి, నివేదిక సమర్పించాలి. ఇందుకోసం ప్రతి అధ్యాపకుడికి కొంతమంది విద్యార్థులను కేటాయిస్తారు. విద్యార్థులకు ప్రతి వారం క్లాస్ రూమ్ సెమినార్, డిబేటు, గ్రూపు డిస్కషన్స్ వంటివి నిర్వహిస్తున్నారు.

కళాశాలలో కోర్సులు

- బీఏ ఎకనామిక్స్
- బీఏ పొలిటికల్ సైన్స్
- బీకాం జనరల్
- బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్
- బీఎస్సీ మేథమేటిక్స్
- బీఎస్సీ కెమిస్ట్రీ
- బీఎస్సీ కంప్యూటర్ సైన్స్
- బీఎస్సీ జువాలజీ

జగన్‌ను కలసిన చింతలపల్లి యువత



వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన చింతలపల్లి కార్యకర్తలు

రాజోలు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో చింతలపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు తాడేపల్లి వెళ్లి గురువారం ఆయనను కలిశారు. ఎన్నికల్లో రాజోలు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో బాధపడుతున్న చింతలపల్లికి చెందిన పార్టీ కార్యకర్తలు దాకే చిరంజీవి, చింతలపల్లి వీరకుమార్, తోట దుర్గాప్రసాద్, రాపాక శ్రీను ఈ నెల 12న తాడేపల్లి వెళ్లారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం కార్యక్రమంతో ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. తాడేపల్లి చేరుకునేసరికి అర్ధరాత్రి కావడంతో అక్కడే ఉండిపోయారు.

గురువారం ఉదయం ఎలాగైనా తమ నాయకుడిని కలవాలని ప్రయత్నించారు. అపాయింట్‌మెంట్ లేకపోవడంతో భద్రతా సిబ్బంది అందుకు అనుమతించలేదు. అదే సమయంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తారసపడడంతో, ఆయన సహకారంతో కార్యకర్తలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఓటమి బాధను మరిచి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్టు కార్యకర్తలు వివరించారు.

కల్యాణోత్సవాలను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే గిడ్డి



కల్యాణోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. తన నివాసంలో స్వామి వారి కల్యాణోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే సత్యనారాయణ గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. ఉద్యోగులు సమన్వయంతో పని చేసి, భక్తులకు ఇబ్బందులు లేకుండా కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు

మామిడికుదురు: మండల పరిధిలోని రైతులు 3,500 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ పంట సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఖరీఫ్ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందించేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ చేపట్టింది. మామిడికుదురు, నగరం, లూటుకుర్రు, కొమరాడ, ఆదుర్రు, పాశర్లపూడి, ఈదరాడ, గెద్దాడ, మొగలికుదురు, పెదపట్నం గ్రామాల్లో రైతులకు ఈ సబ్సిడీ వరి విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఎంటీయూ–1064 రకం వరి విత్తనాలు 24 క్వింటాళ్లు, ఎంటీయూ–1318 రకం వరి విత్తనాలు 96 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖాధికారి బి.మృదుల గురువారం తెలిపారు. కిలోకు రూ.5 సబ్సిడీపై విత్తనాలు రైతులకు అందజేస్తున్నామన్నారు. 30 కిలోల విత్తనాల బస్తా రూ.1,194 కాగా, దాన్ని సబ్సిడీ పోను రూ.1,044కు విక్రయిస్తున్నామని చెప్పారు. ఎంటీయూ–1318, ఎంటీయూ–1064 రెండు రకాలు ఇదే ధరకు విక్రయిస్తున్నామని ఏఓ తెలిపారు.

బాధితులకు జగ్గిరెడ్డి పరామర్శ



కొత్తపేట ప్రభుత్వాస్పత్రిలో బాధితురాలు లోవలక్ష్మిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



బాధితుడు నాగరాజును పరామర్శిస్తున్న జగ్గిరెడ్డి

టీడీపీ నేతల దాడులపై ఆగ్రహం

కొత్తపేట: రావులపాలెం మండలం కేతరాజుపల్లి, ఆత్రేయపురం మండలం పులిదిండి గ్రామాల్లో టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. కేతరాజుపల్లి గ్రామంలో గతంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు శీలం లోవలక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఆమెపై గ్రామ టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఆమె కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, గురువారం ఉదయం మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరామర్శించారు. దాడిపై ఆయన ఆరా తీశారు. ఎన్నికల్లో విజయం సాధించామన్న గర్వంతో, గతంలో వార్డు మెంబరుగా పోటీ చేశానన్న అక్కసుతో ఈ దాడికి పాల్పడ్డారని జగ్గిరెడ్డి ముందు లోవలక్ష్మి కన్నీటిపర్యంతమయ్యారు. అలాగే ఆత్రేయపురం మండలం పులిదిండి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ముండెల్లి నాగరాజుపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి, మద్యం సీసాతో తలపై మోది తీవ్రంగా గాయపరిచారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడిని జగ్గిరెడ్డి పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెబుతూ, వారికి అండగా ఉన్నానంటూ భరోసా ఇచ్చారు.

టీడీపీ ఆగడాలకు అంతే లేదు

ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకుల ఆగడాలకు అంతూ పొంతూ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాటి బీసీ వర్గానికి చెందిన మహిళ అని కూడా చూడకుండా దాడికి పాల్పడతారా? వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేయకూడదా? పోటీ చేస్తే దాడి చేస్తారా? ఇదేమి దారుణమంటూ తీవ్రంగా ఖండించారు. అధికారం వచ్చింది కదా అని ఇలా ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తే ప్రజలు మరలా ఛీత్కరించే రోజులు వస్తాయని హెచ్చరించారు. ఆయన వెంట అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ ముసునూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల బ్రహ్మానందం, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణకుమార్, కేతరాజుపల్లి సర్పంచ్ అంబటి సుబ్బలక్ష్మి తదితరులు ఉన్నారు.

క్రీడా మైదానాన్ని పరిశీలించిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న విద్యా శాఖ అధికారులు

అయినవిల్లి: 'అసాంఘిక కార్యక్రమాలను నెలవుగా క్రీడా మైదనం' శీర్షికన ఈ నెల 12న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యా శాఖ అధికారులు స్పందించారు. ఉప విద్యా శాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశరావు, ఎంఈఓ–2 పెచ్చెట్టి శ్రీనివాస్, స్కూలు హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించారు. అక్కడ విచ్చలవిడిగా పడి ఉన్న ఖాళీ మద్యం సీసాలను తొలగించే చర్యలు తీసుకున్నారు. పాఠశాల చుట్టూ అసంపూర్తిగా ఉన్న రక్షణ గోడలను పూర్తి స్థాయిలో నిర్మించడానికి, అలాగే ఇనుప గేట్లను బాగు చేయించడానికి చర్యలు తీసుకోవాలని హెచ్ఎంకు సూచించారు. క్రీడా మైదానంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. వీరి వెంట నేదునూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి.ప్రసాద్, ఉపాధ్యాయులు జి.సాయిశ్రీనివాస్, పీఈటీ రమేష్ తదితరులు ఉన్నారు.

చట్టపరమైన చర్యలు తప్పవు

ప్రభుత్వ భవనాలు, పాఠశాలల క్రీడా మైదానాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై వి.రాజేష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఆయన సిరిపల్లి జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానాన్ని పరిశీలించారు. 'సాక్షి' కథనం ఆధారంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల క్రీడా ప్రాంగణాలను పరిశీలిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా అక్కడున్న పలువురు విద్యార్థులు, యువకులకు అవగాహన కల్పించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

మోగిన బడి గంట

- పాఠశాలలు పునః ప్రారంభం
- విద్యార్థులకు స్కూలు కిట్ల పంపిణీ



పాశర్లపూడి మెయిన్ స్కూల్లో విద్యార్థుల సందడి



అంబాజీపేటలో విద్యార్థులకు కిట్లను అందిస్తున్న రామతులసి

ఆలమూరు: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఎంఈఓలు పి.సాలెంరాజు, పీవీ సుబ్బరాజు నేతృత్వంలో విద్యాశాఖ అధికారులు మండలంలో ఉన్న 49 పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 3,552 మందికి ఇప్పటికే సంబంధిత పాఠశాలలకు ఎనిమిది రకాలతో కూడిన స్కూల్ కిట్లను పంపించారు. గత ఐదేళ్ల నుంచి కొనసాగిన ఒరవడి ఈ ఏడాది కూడా సాగడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ కిట్లలో రెండు జతల యూనిఫారం, బూట్లు, బెల్టులు పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, సాక్సులు, డిక్షనరీలు ఉన్నాయి. వాటిని ఆయా పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు అందజేశారు.

ఉత్సాహంగా విద్యార్థుల హాజరు

మామిడికుదురు: వేసవి సెలవుల అనంతరం మండలంలో మొత్తం 90 పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. వాటిలో 72 ప్రభుత్వ పాఠశాలలు కాగా, మిగిలిన 18 ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో మొత్తం 7,958 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 72 ప్రభుత్వ పాఠశాలల్లో 59 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 3,451 మంది విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల్లో 4,507 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏప్రిల్ 24న వేసవి సెలవులు ప్రకటించారు. సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాఠశాలలకు హాజరయ్యారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా శాఖ ఉచితంగా సమకూర్చిన పాఠ్య పుస్తకాలను అందజేశారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు

అంబాజీపేట: విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు పీఎంసీ చైర్‌పర్సన్ అరిగెల రామతులసి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్కూల్ కిట్లను హెచ్ఎం కదలి సాయిరామ్ అధ్యక్షతన గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామతులసి మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభ రోజునే విద్యార్థులకు కిట్లను అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం సమకూర్చుతున్న స్కూల్ కిట్లను సద్వినియోగం చేసుకుని, శ్రద్ధగా చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్సులను అందజేశారు. కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి

ఆత్రేయపురం: విధి నిర్వహణలో విద్యుదాఘాతానికి గురై మండలంలోని నార్కెడ్‌మిల్లి గ్రామానికి చెందిన లైన్‌మన్ సుంకర ఈశ్వరరెడ్డి (36) మృతి చెందినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. రంపచోడవరానికి చెందిన సుంకర ఈశ్వర్‌రెడ్డి రెండేళ్లుగా నార్కెడ్‌మిల్లిలో లైన్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల 16న నార్కెడ్‌మిల్లిలో పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. రావులపాలెం ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.

ఆహార సుస్థిర అభివృద్ధిపై అవగాహన

సఖినేటిపల్లి: మండలంలోని సఖినేటిపల్లిలంక గ్రామంలో గురువారం ఏపీ ఎస్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి విద్యార్థులకు, గ్రామస్తులకు ఆహార సుస్థిర అభివృద్ధి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ ఎస్జీసీ, ఏపీ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరుగుతేన్న ఏడు రోజుల షెడ్యూల్‌లో భాగంగా రెండో రోజు ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ ప్రకృతిలో మమేకమయ్యే రీతిలో గ్రామంలోని కొన్ని పొలాల్లో వారితో కలిపి ఆమె పర్యటించారు. అలాగే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను నాలుగు గ్రూపులుగా విభజించి, ఆహార సుస్థిర అభివృద్ధికి తోడ్పాటునిచ్చే అంశాలపై కూడా ఆమె అవగాహన కల్పించారు. దీంతో మొక్కలు నాటడంలోను, చేతి వృత్తులను పరిశీలించడంలోను, భూ ఆవరణ చరిత్రను తెలుసుకోవడంలోను, ఆచార సంప్రదాయాలను పరిశీలించడంలోను విద్యార్థులు మమేకమయ్యారు. గ్రామ పెద్దలు రేవూరి ఏసు నరసింహ రాజా, నడింపల్లి వెంకట సుబ్బరాజు, చల్లా నాగరాజు, విద్యావేత్తలు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.